సంపుటి : 9
సంచిక : 363
శుక్రవారం
25 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELERRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999

## వరద నీటితో

# జలాశయాలు నింపండి

- ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడండి
- భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలి
- సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు



**అమరావతి, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరదల్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని నిర్దేశించారు. 'శుక్రవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి చక్కదిద్దాలి. దెబ్బతిన్న రహదారుల్ని పునరుద్ధరించాలి. కొండచరియలు విరిగిపడేచోట నివాసితుల్ని అప్రమత్తం చేయాలి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి' అని ఆదేశించారు. భారీ వర్షాలు, వివిధ జిల్లాల్లో పరిస్థితిపై వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో, ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కూడా పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నదులు, వాగులకు వస్తున్న వరద ప్రవాహాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలోని అన్ని జలాశయాలు, నీటి వనరులను నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సాధారణ జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రకాశం బ్యారేజీతో పాటు మున్నేరు పరీవాహక ప్రాంతం నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో నిల్వ చేయాలని, అవసరమైతే మోటార్లు ఉపయోగించి లిఫ్ట్ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి ప్రవాహాలతో ఏలేరు రిజర్వాయర్‌లో 24 టీఎంసీల నీటిని నింపాలని, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు నీటిని తరలించాలని దిశానిర్దేశం చేశారు. విశాఖ, అనకాపల్లి, శ్రీకాకుళం,

మిగతా .. 2లో..

ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు..

# ఢిల్లీలో లోకేశ్ పెట్టుబడుల వేట

- ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం
- విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రెజ్‌లకు ప్రతిపాదనలు



**ఢిల్లీ, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు.

**కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం**

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత,

మిగతా .. 2లో..

## మక్కాలో అలర్ట్



**రియాద్, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** సౌదీ అరేబియా పౌర రక్షణశాఖ మరోసారి 'డేంజర్ బెల్స్' మోగించింది. పవిత్ర ప్రదేశమైన మక్కా, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో హూతీలు క్షిపణిదాడులకు దిగే అవకాశం ఉందని ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు అక్కడి అధికార మీడియా ఎక్స్‌లో పోస్టు చేసింది. గత 10 రోజుల వ్యవధిలో ఇలాంటి హెచ్చరికలు జారీ కావడం ఇది రెండోసారి. సౌదీ పశ్చిమతీరంలోని యాన్బు, తాయెఫ్, జెద్దా, తబూక్ తదితర ప్రాంతాల్లోనూ దాడులకు అవకాశం ఉన్నట్లు వేర్వేరుగా హెచ్చరికలు జారీ అయ్యాయి. ఇరాన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్న హూతీలు మక్కాపై దాడులకు పాల్పడిన నేపథ్యంలో తాజా హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల మక్కాపైకి హూతీలు డ్రోన్‌ను ప్రయోగించిన సంగతి తెలిసిందే. అది

మిగతా .. 2లో..

## పవన్ కల్యాణ్‌తో వంగవీటి ఆత్మీయ భేటీ

మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సమావేశం
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘ చర్చ
పవన్ చేపడుతున్న సంస్కరణలను అభినందించిన రాధా



**మంగళగిరి, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ భేటీ అయ్యారు. మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఈ సమావేశం జరిగింది. ఇది మర్యాదపూర్వక భేటీ అని, ఇరువురి మధ్య

మిగతా .. 2లో..

## రేవంత్‌రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు

'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026'గా ఎంపిక - నేడు కేరళంలో ప్రదానోత్సవం



**హైదరాబాద్, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్- 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపికయ్యారు. కేరళంకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న

మిగతా .. 2లో..

టీచర్లపై దాడి చేసిన వారిలో

## 60% పైగా నేరచరితులే

వారిలో ఒక్కొక్కరిపై సగటున పదేసి కేసులు : హోం మంత్రి అనిత ధ్వజం



**అమరావతి, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** శాప్ కార్యాలయంపైకి దండెత్తి ఉపాధ్యాయులపై దాడులు చేసిన వారిలో 60 శాతం మందికి పైగా రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లు, గూండాలు, బ్లేడ్‌బ్యాచ్‌ల వారేనని హోం మంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. వీరిలో ఒక్కొక్కరిపై సగటున పదేసి కేసులున్నాయని చెప్పారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు

మిగతా .. 2లో..

## ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం

సతీసమేతంగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆమె కుమార్తె అంజలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా

మిగతా .. 2లో..

మానవ నియంత్రణలోనే

## ఏఐ ఉండాలి

అమెరికాలో జిన్‌పింగ్



**సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** మూడు రోజుల పర్యటన కోసం అమెరికా వెళ్లిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. వైట్‌హౌస్ వేదికగా జరిగిన సమావేశంలో ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్‌తో 'నిజంగా గొప్ప స్నేహం' ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అనంతరం జిన్‌పింగ్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండేలా చైనా, అమెరికాలు కలిపి పనిచేయాలని పిలుపునిచ్చారు. "ప్రపంచ శ్రేయస్సు కోసం

మిగతా .. 2లో..

# వాయుగుండం దాటికి అల్లాడుతున్న ఏపీ

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు!



గుంటూరు జిల్లా లామ్ కొండవీటి వాగు సమీపంలో ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం



ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం ఊటుకూరు-నెమలి మధ్య ఉన్న వల్లవాగు వద్ద వరద ఉధృతి





విశాఖ: రహదారిపై చేరిన వరద నీరు.



ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో భారీ వర్షానికి కూలిన పోలీస్ స్టేషన్ ప్రహరీ



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడిలో భారీ వర్షాలకు పశువుల పాక కూలడంతో మృతిచెందిన గేదెలు.



పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జలాశయం పొర్లు కాలువ



విశాఖ: రహదారిపై వరద నీటిలో వాహనదారుల ఇక్కట్లు

**సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌ను ముసురు వానలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు పలు జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపైకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వాగులు, వంకలు, చెరువులు అన్నీ పొంగిపొర్లుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాలకు

మిగతా .. 2లో..



(మొదటిపేజీ తరువాయి)

# వరదనీటితో జలాశయాలు నింపండి

మన్యం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా 16 జిల్లాల్లో వర్ష ప్రభావం అధికంగా ఉందని అధికారులు తెలిపారు.

**ప్రధాన నదులకు వరద హెచ్చరికలు**

గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుత వర్షాలకు గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, పంపా, మేఘాద్రిగడ్డ రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరనుందని అధికారులు అంచనా వేశారు. గొట్టా బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 25 ఉదయానికి, భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం నాటికి మొదటి, సాయంత్రానికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయవచ్చని వివరించారు.

**ఎల్‌నినోపై వ్యూహం.. సాంకేతికత వినియోగం**

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించేందుకు భూసారాన్ని పెంచడం, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాలను ప్రోత్సహించాలని చంద్రబాబు అన్నారు. దీనిని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని ఆదేశించారు. అక్టోబరు 2న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నామని, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే కార్యక్రమం కూడా అదే రోజు ప్రారంభిస్తామని తెలిపారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా అమెరికాలో ఉంటున్న పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్‌ను సీఎం పరిశీలించి, అతడిని అభినందించారు. ఈ సమీక్షలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, విద్యుత్ సరఫరా నాణ్యత పెంచాలని, ఇసుక సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు శాప్ ఆధ్వర్యంలో వార్షిక క్రీడా క్యాలెండర్ రూపొందించాలని సూచించారు. నియోజకవర్గాల్లో అధికారుల పనితీరు మెరుగుపరిచేందుకు నోడల్ అధికారులతో సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

# ఢిల్లీలో లోకేశ్ పెట్టుబడుల వేట

డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

**గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది**

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు. దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

**ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్‌తో భేటీ**

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు శాప్ నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

**స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి**

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

**వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: అబాట్‌కు ఆహ్వానం**

అమెరికాకు చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, ఫార్మా సంస్థ అబాట్ ఇండియా ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని మెడ్‌టెక్ జోన్ (ఆమ్టీజ్) లేదా ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో వైద్య పరికరాలు లేదా డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని, విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై అంజాద్ స్పందిస్తూ, భారత్‌లో తమకు గోవా, గుజరాత్‌లలో తయారీ కేంద్రాలున్నాయని, స్థానిక ఫార్మా సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

**ఏపీలో ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయండి: సిస్కోతో లోకేశ్ భేటీ**

గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

**వివో కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయండి**

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌తోనూ లోకేశ్ సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా ఎదుగుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వివో సరఫరాదారుల కోసం ప్రత్యేకంగా ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్' అభివృద్ధి చేయాలని, దీనికోసం ప్రభుత్వంతో కలిసి 'సప్లై చైన్ సమావేశం' నిర్వహించాలని సూచించారు. అర్జిత్ సేన్ స్పందిస్తూ, దేశంలో విక్రయించే ఫోన్లలో 99% పైగా గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం మీద, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయడమే లక్ష్యంగా సాగింది. పలు దిగ్గజ సంస్థల నుంచి సానుకూల స్పందన రావడంతో, భవిష్యత్తులో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# మక్కాలో అలర్ట్

నిషేధిత మక్కా గగనతలంలోకి ప్రవేశించకముందే రాయల్ సౌదీ ఎయిర్ డిఫెన్స్ బలగాలు దానిని అడ్డుకొని, నిర్వీర్యం చేశాయి. మక్కా దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో తొలిసారిగా అలర్ట్ ప్రకటించాయి. అంతకుముందు 2017లో హూతీలు మక్కా నగరాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించారు.

# పవన్ కల్యాణ్‌తో వంగవీటి ఆత్మీయ భేటీ

ఆత్మీయ వాతావరణంలో చర్చలు జరిగాయని తెలిసింది. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహబంధం నేపథ్యంలో ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా గతంలో ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేసిన రోజులను, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో కలిసి ప్రచారం నిర్వహించిన క్షణాలను ఇరువురూ గుర్తుచేసుకున్నారు. ఈ సమావేశంలో సమకాలీన రాజకీయ పరిస్థితులు, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించుకున్నట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ తన శాఖల్లో చేపడుతున్న సంస్కరణలు, తీసుకొస్తున్న మార్పులను వంగవీటి రాధా ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ భేటీ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### టీచర్లపై దాడి చేసిన వారిలో

# 60% పైగా నేరచరితులే

జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి వారందరికీ తన పార్టీలో యువజన, విద్యార్థి సహా పలు విభాగాల్లో పదవులిచ్చి.. ఉపాధ్యాయులపైకి ఉసిగొల్పారని ఆరోపించారు. వీరిలో చాలా మందిపై హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, మహిళలపై వేధింపులు, పోక్సో కేసులున్నాయని చెప్పారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం హోం మంత్రి.. దాడుల్లో పాల్గొన్న వారి నేరచరిత్ర, వారిపై ఉన్న కేసులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆ ఫోటోలు విడుదల చేశారు. రౌడీషీటర్లు, గూండాలను తీసుకొచ్చి వారిని డీఎస్సీ అభ్యర్థులని, జెన్‌జీ అని చెప్పటం గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. వైకాపా గూండాల దాడులు చేస్తుంటే చర్యలు తీసుకోకుండా చూస్తూ కూర్చోవాలా అని ప్రశ్నించారు. ఆమె ఏమన్నారంటే..

**పోక్సో కేసుల్లో ఉన్న వారిని తెచ్చి దాడులా?**

నందిగామకు చెందిన రౌడీషీటర్ బెజవాడ రాజశేఖర్‌పై మహిళలపై లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, హత్యాయత్నాలు, ఇళ్లల్లోకి అక్రమంగా చొరబడటం తదితర నేరాలకు సంబంధించి 7 కేసులున్నాయి.

నందిగామకే చెందిన ట్రబుల్ మాంగర్ మాడుగుల మనోహర్‌పై పోక్సో చట్టంలోని సెక్షన్లతో పాటు మహిళలను వేధించటం, వారి వ్యక్తిగత దృశ్యాలను చిత్రీకరించటం, బెదిరించటం వంటి అభియోగాలపై కేసులున్నాయి.

ఏ.కొండూరుకు చెందిన రౌడీషీటర్ కలసాని చెన్నారావు ఎలియాస్ రాడ్‌పై మహిళలపై వేధింపులు, దాడులు సహా ఇతర అభియోగాలకు సంబంధించిన మొత్తం 9 కేసులున్నాయి.

వీరందరికీ గొడ్డలి పార్టీలో పదవులు ఇవ్వటమే కాకుండా... వారిని శాప్ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి ఉపాధ్యాయులపై దాడులు చేయించారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి వారిని వెనకేసుకొస్తూ వారికి మద్దతుగా గవర్నర్‌ను కలవటానికి వెళ్లడం దారుణం. పైగా వారంతా చిన్నపిల్లలని జగన్ చెబుతున్నారు. పోక్సో కేసులున్న వారు చిన్నపిల్లలా?

**దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవద్దా?**

1. జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే: మారణాయుధాలతో దాడులు, నేరపూరిత బెదిరింపులు, అక్రమంగా నిర్బంధించటం సహా అనేక అభియోగాలపై 37 కేసులున్నాయి. రాజమహేంద్రవరంలో బ్లేడ్‌బ్యాచ్‌లను నడిపించేది ఈయనే. ఇలాంటి వ్యక్తికి వైకాపా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడి పదవి ఇచ్చారు. ఆయన ఉపాధ్యాయులపై దాడులు చేస్తుంటే చర్యలు తీసుకోవద్దా?

2. పానుగంటి చైతన్య: గుంటూరుకు చెందిన రౌడీషీటర్. వైకాపా హయాంలో తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిలో ముఖ్యుడు. హత్యాయత్నాలు, దాడులు, అల్లర్లు, బెదిరింపులు, అక్రమ చొరబాట్లు తదితర అభియోగాలకు సంబంధించి 22 కేసులున్నాయి. అలాంటి వ్యక్తికి వైకాపా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పదవి ఇచ్చారు. శాప్ కార్యాలయం వద్దకు వచ్చే ముందు 50–60 కార్లలో రౌడీలను వెంటబెట్టుకుని తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లాడు. అక్కడ ఇచ్చిన ఆదేశాల మేరకు ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడ్డాడు.

3. మల్లాది విష్ణు, జోగి రమేష్: వైకాపా మాజీ ఎమ్మెల్యేలైన వీరిద్దరిపైనా నకిలీ మద్యం విక్రయాలకు సంబంధించిన కేసులున్నాయి. మల్లాది విష్ణుపై మహిళలపై వేధింపులు, బెదిరింపులు సహా వివిధ అభియోగాలకు సంబంధించి 21 కేసులున్నాయి. జోగి రమేష్‌పై అల్లర్లు, దాడులు సహా పలు అభియోగాలపై 19 కేసులున్నాయి.

4. కంచికచర్లకు చెందిన రౌడీషీటర్ మార్త శ్రీనివాసరావుపై 15, మాజీ రౌడీషీటర్ వేమ సురేష్‌బాబుపై 14 కేసులున్నాయి. వీటిలో హత్యాయత్నాలు, దాడులు వంటి వంటి కేసులున్నాయి.

5. వైకాపా హయాంలో తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి తెగబడ్డ దేవినేని అవినాష్, ట్రబుల్ మాంగర్ అవుతు శ్రీనివాసరెడ్డి, మాజీ రౌడీషీటర్ అరవ సత్యంపై అనేక కేసులున్నాయి.

జగన్ ఇలాంటి వారందర్నీ పంపించి ఉపాధ్యాయులపై దాడులు చేయించటమే కాక ఆ రౌడీలు, గూండాలను రక్షించాలని గవర్నర్‌ను కోరటం దిగజారుడుతనం కాదా? బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన రౌడీషీటర్లు చిత్రాల ఒబేదు, రాజ్‌పాల్‌లు ఉపాధ్యాయులపై దాడికి పాల్పడితే.. వారికి మద్దతుగా 'వియ్ స్టాండ్ విత్' అనే పోస్టర్లు వేసి ప్రచారం చేయడమేంటి? 'వియ్ స్టాండ్ విత్ రౌడీషీటర్లు, వియ్ స్టాండ్ విత్ క్రిమినల్స్' అని పోస్టర్లు వేసుకోవటానికి వైకాపాకు సిగ్గు ఉండాలి.

# రేవంత్‌రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు

కార్యక్రమాలు, దూరదృష్టి కలిగిన నాయకత్వానికిగాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి.అనిల్‌కుమార్, కల్పేట్టా నారాయణన్‌లు జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై రేవంత్‌రెడ్డికి ఉన్న నిబద్ధతను జ్యూరీ కొనియాడింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళంలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు అవార్డును రేవంత్‌రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. ఈ వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి.వేణుగోపాల్.. ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోపన్యాసం చేస్తారు. "ఆర్యదాన్ ముహమ్మద్ కేరళం కాంగ్రెస్ సీనియర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు మంత్రిగా సేవలందించారు. రాజనీతిజ్ఞుడిగా, దూరదృష్టి గల నేతగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా ఆర్యదాన్ ముహమ్మద్ కేరళం ప్రజల మదిలో నిలిచిపోయారు" అని ఫౌండేషన్ పేర్కొంది.

# ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం

కాబోయే వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు. నూతన జంటకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యుల మధ్య ఈ వేడుక వైభవంగా జరిగింది. కాగా, తన కుమార్తె వివాహానికి సంబంధించిన కీలక తేదీలను షర్మిల కొద్ది రోజుల క్రితమే స్వయంగా ప్రకటించారు. సెప్టెంబర్ 24న నిశ్చితార్థం, నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ ఉంటుందని ఆమె ఎక్స్ వేదికగా వెల్లడించారు. వివాహ వేడుకకు సంబంధించిన మొదటి ఆహ్వాన పత్రికను ఇడుపులపాయలోని తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ క్రమంలో, వివాహ ఆహ్వానం కోసం తన సోదరుడు వైఎస్ జగన్‌ను కలవడంపై వస్తున్న రాజకీయ ఊహాగానాలను షర్మిల ఖండించారు. తన కుమార్తె వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణాలు చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

# మానవ నియంత్రణలోనే ఏఐ ఉండాలి

కృత్రిమ మేధను అభివృద్ధి చేయడం, నిర్వహించే సామర్థ్యం, బాధ్యత రెండు దేశాలకు ఉంది. అయితే, ఏఐని ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండేలా చూడాల్సిన బాధ్యత ఇరు దేశాలపై ఉంది" అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. స్నేహానికి గుర్తుగా అమెరికాకు (అట్లాంటాలోని జంతు ప్రదర్శనశాలకు) రెండు చైనా పాండాలను పంపిస్తామని అన్నారు.

# వాయుగుండం దాటికి అల్లాడుతున్న ఏపీ

బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. చేతికందే దశలో ఉన్న ఎన్నో పంట పొలాలు నీట మునిగిపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో కూరుకుపోయింది. ప్రతి వాయుగుండం వచ్చినప్పుడల్లా ముంపు ప్రాంతాల ప్రజలు అల్లాడిపోవడం, రోడ్లు జలమయం కావడం మామూలైపోయింది. కేవలం వాతావరణ శాఖ హెచ్చరికలతో సరిపెట్టకుండా, డ్రైనేజీ వ్యవస్థలను సరిచేయడంలో అధికార యంత్రాంగం చూపిస్తున్న నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం ముంపు బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు, పంట నష్టపోయిన రైతులను అరకొర పరిహారాలతో కాకుండా పక్కాగా ఆదుకోవాలి. నిరంతరం పొంగిపొర్లుతున్న వాగులు, వంకల దగ్గర గస్తీ ఏర్పాటు చేసి ప్రాణనష్టం జరగకుండా అత్యవసర చర్యలు చేపట్టకపోతే పరిస్థితి మరింత దిగజారడం ఖాయం.

# విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సు-2026పై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా, పారిశ్రామికవేత్తల్లో నూతనోత్సాహం నింపేలా విశాఖపట్నంలో నిర్వహించనున్న 'సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026'ను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సదస్సు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి చాటిచెప్పేలా ఉండాలని స్పష్టం చేశారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనున్న ఈ సదస్సు సన్నాహకాలపై గురువారం సచివాలయంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సదస్సుకు ముందు రాష్ట్రంలోని ఐదు కీలక ప్రాంతాల్లో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి, స్థానిక ప్రత్యేకతలకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలని దిశానిర్దేశం చేశారు.

**ఎంఎస్ఎంఈలకు పెద్దపీట.. వినూత్న కార్యక్రమాలు**

ఈసారి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇందులో భాగంగా, భాగస్వామ్య సదస్సుకు ముందే రాష్ట్రంలోని 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రీజినల్ కాన్ఫరెన్స్‌లో 'ఎంఎస్ఎంఈ షోకేస్' ఏర్పాటు చేసి వారి ఉత్పత్తులను ప్రదర్శించాలని, స్టార్టప్‌లకు పెట్టుబడులు సమకూర్చేందుకు 'షార్క్ ట్యాంక్' తరహా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాలని వినూత్న సూచన చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఈ ప్రాంతీయ సదస్సులకు అనుసంధానించాలని చెప్పారు. విద్యార్థి దశ నుంచే పారిశ్రామిక స్ఫూర్తిని నింపేందుకు 7వ తరగతి నుంచే పాఠ్యాంశాల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను చేర్చాలని, 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లో నిర్వహించాలని ఆదేశించారు.

**పాత ఒప్పందాల వేగవంతంపై దృష్టి**

సమీక్ష సందర్భంగా, గతంలో కుదిరిన ఒప్పందాలను (ఎంఓయూ) వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడంపై సీఎం ప్రధానంగా దృష్టి సారించారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.22.57 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయని అధికారులు వివరించారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయని, 247 ప్రాజెక్టుల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని (గ్రౌండింగ్) తెలిపారు. అక్టోబర్ చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలని, కన్వర్ట్ అయిన వాటిలో 75 శాతం ప్రాజెక్టుల పనులు ప్రారంభించేలా పనిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

**రీజినల్ కాన్ఫరెన్స్‌ల షెడ్యూల్ ఖరారు**

రాష్ట్రంలోని ఐదు నగరాల్లో అక్టోబర్ 7 నుంచి 26 వరకు రీజినల్ కాన్ఫరెన్సులు జరగనున్నాయి.

అక్టోబర్ 7 (విశాఖపట్నం): ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ, ఫార్మా, మెడ్‌టెక్.

అక్టోబర్ 12 (కాకినాడ): మారిటైమ్, షిప్ బిల్డింగ్, గ్రీన్ హైడ్రోజన్, ఆక్వా ఎగుమతులు.

అక్టోబర్ 16 (గుంటూరు): గవర్నెన్స్, రాజధాని నిర్మాణం, క్వాంటం వ్యాలీ, అర్బన్ ఇన్‌ఫ్రా.

అక్టోబర్ 23 (అనంతపురం): ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమోటివ్, పునరుత్పాదక ఇంధనం.

అక్టోబర్ 26 (తిరుపతి): టూరిజం, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, స్పేస్ టెక్నాలజీ.

ఈ ప్రాంతీయ సదస్సుల్లోనే చాలా వరకు ఎంవోయూలు పూర్తవుతాయని, ప్రధాన సదస్సులో మాత్రం కీలక ప్రాజెక్టులు, ఉన్నత స్థాయి చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ప్రపంచవ్యాప్తంగా ప్రచారం.. భారీగా రోడ్‌షోలు**

'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్' అనే థీమ్‌తో జరగనున్న ఈ సదస్సుకు అంతర్జాతీయంగా ప్రచారం కల్పించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. దేశీయంగా చెన్నై, బెంగళూరులో రోడ్‌షోలు పూర్తి కాగా, త్వరలో అహ్మదాబాద్, హైదరాబాద్, ముంబైలో నిర్వహించనున్నారు. సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్‌లలో అంతర్జాతీయ రోడ్‌షోలు పూర్తయ్యాయి. స్వీడన్, జపాన్, చైనాలోనూ త్వరలో జరగనున్నాయి. ఈ సదస్సుకు 11 మంది అంతర్జాతీయ మంత్రులు, 21 దేశాల ప్రతినిధులు ఇప్పటికే తమ షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. అక్టోబర్ 8న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మరోవైపు, కాపులుప్పాడలో నిర్మించే కన్వెన్షన్ సెంటర్‌ను బహుళ ప్రయోజనాలకు అనువుగా తీర్చిదిద్దాలని, రాజమండ్రిలోని సెంటర్‌ను గోదావరి పుష్కరాల నాటికి పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు.

# ఎడిటర్ వాయిస్

## బొత్స కంటే చిన్న శ్రీను బలవంతుడా?

విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ సీనియార్టీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బొత్సది నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం. అయితే అందులో సగం పైగా జీవితం చిన్న శ్రీనుది. ఈ ఇద్దరూ కలిసి రెండు దశాబ్దాలకు పైగా జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పారు. బొత్సకు నీడలా ఉంటూ జిల్లాపైన చిన్న శ్రీను ఆధిపత్యం చాటుకున్నారు. బొత్స రాష్ట్ర రాజకీయాల్లో ఉంటూ జిల్లాను చిన్న శ్రీనుకు అప్పగించారు. ఆ విధంగా చిన్న శ్రీను పాతుకుని పోయారు అని చెప్పాలి. ఈ రోజున జిల్లాలో వైసీపీలో అనేక పదవులు అనుభవిస్తున్న వారందరికీ నేరుగా చిన్న శ్రీనుతోనే పరిచయాలు సాన్నిహిత్యం ఉంది. అందుకే అయిదుగురు జెడ్పీటీసీలు రాజీనామా చేసి చిన్న శ్రీను వెంట నడిచారు అని చెబుతున్నారు.

**వ్యూహాలతోనే అంతా :** చిన్న శ్రీను పేరులో చిన్న ఉండొచ్చు కానీ ఆయన వ్యూహాలలో పెద్ద అని అంటున్నారు. ఆయన రాజకీయ బలం ఏంటో త్వరలోనే చూపిస్తారు అని అంటున్నారు. విజయనగరం జిల్లాలో వైసీపీ మొత్తంగా ఆయనకు పట్టు ఉందని అంటున్నారు. చిన్న శ్రీను ఇపుడు టీడీపీలో చేరడంతో సహజంగానే ఆయన వర్గం కూడా ఆ వైపే ఉంటుందని అంటున్నారు. చిన్న శ్రీను వెంట తాము పాతికేళ్ళుగా నడిచామని అందుక ఆయన తోనే తాము అంటూ వైసీపీకి రాజీనామా చేసిన జెడ్పీటీసీలు చెప్పడాన్ని బట్టి చూస్తే ఇక్కడ పార్టీ కంటే చిన్న శ్రీనుకే ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. ఎవరు పోయినా పార్టీ శాశ్వతం అన్న బొత్స మాటలకు భిన్నంగా తమకు చిన్న శ్రీనుయే ముఖ్యమని పలువురు నేతలు చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని కూడా ప్రశ్నలు వస్తున్నాయి.

**చిన్న శ్రీను ప్రభావం :** ఇదిలా ఉంటే జిల్లా రాజకీయాల్లో చిన్న శ్రీను ప్రభావం గట్టిగానే ఉంటుందని అంటున్నారు. ఆయనకు ఉన్న అనుచర గణంతో పాటు వ్యూహాలు సామాజిక బలం రాజకీయ చతురత ఇవన్నీ కలస్తే ఆయన జిల్లా రాజకీయాలను ప్రభావితం చేయడం ఖాయమని అంటున్నారు. జిల్లాలో అణువణువూ తెలిసిన నేతగా ఆయన ఉన్నారు. టీడీపీలో కూడా ఆయన ధీటుగానే రాణించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయని చెబుతున్నారు. అక్కడ నియోజకవర్గం నాయకులే అధికంగా ఉన్నారు. అలాంటి చోట జిల్లా మొత్తం తెలిసిన నేతగా చిన్న శ్రీను హవా ఉంటుందని చెబుతున్నారు. మరో వైపు చూస్తే చిన్న శ్రీను వైసీపీని వీడడం వల్ల ఆ పార్టీకి తీరని నష్టం అని అంటున్నారు.

**బొత్సకు ఇబ్బందులేంటి :** ఇక బొత్స విషయం చూస్తే చిన్న శ్రీను మాదిరిగా కుడిభుజం లాంటి నాయకుడు వెంట లేకపోవడం మైనస్ గా మారుతోంది అని అంటున్నారు. బొత్స రాష్ట్ర స్థాయి నేత. ఆయన జిల్లాలో ప్రతీ చోటా తిరిగి అంతటా తానుగా కనిపించలేరు. మరో వైపు చూతే క్యాడర్ కి ఆయనకు మధ్య ఇపుడు గ్యాప్ ని పూరించే నాయకత్వం కావాలి. ఆయన రాజకీయ వారసులుగా సొంత బిడ్డలు ఉన్నా వారు ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో చిన్న శ్రీనుని టీడీపీని ఏకకాలంలో ఢీ కొట్టడం అంటే వైసీపీకి బొత్స కి కష్ట సాధ్యమే అవుతుంది అని అంటున్నారు. బొత్స సైతం పదునైన రాజకీయ వ్యూహాలు రచించగలరు, కానీ ఆయనకు వయోభారం కూడా ఒక సమస్యగా మారుతుందని అంటున్నారు. ఏది ఏమైనా బొత్స వర్సెస్ చిన్న శ్రీను అంటే



చిన్న శ్రీను వైపే నేతలు మళ్ళడాన్ని చూసినపుడు చిన్న శ్రీను బలవంతుడుగా వారికి కనిపిస్తున్నారా అంటే ఇప్పటికి ఇదే కరెక్ట్ అని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## ప్రణయ్ పరువు హత్యకేసు.. చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి



**చర్లపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమ వివాహం చేసుకున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ప్రణయ్ హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతి చెందాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో బారీ నాల్గో నిందితుడు. గుజరాత్‌కు చెందిన మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ అబ్దుల్ బారీ నిందితుడిగా ఉన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన, నల్గొండ జిల్లా మిర్యాలగూడలో 2018లో జరిగిన పెరుమాళ్ల ప్రణయ్‌కుమార్ పరువు హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవితఖైదు విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు గతేడాది మార్చిలో సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసులో ప్రథమ ముద్దాయి తిరునగరు మారుతీరావు... 2020లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతనిపై విచారణను న్యాయస్థానం అప్పుడే నిలిపివేసింది. ఐదేళ్ల తొమ్మిదినెలల సుదీర్ఘ విచారణ తర్వాత.. హత్యలో కీలక పాత్రధారి సుభాష్‌కుమార్‌శర్మకు ఉరిశిక్ష, ఏ3: అస్గర్ అలీ, ఏ4: అబ్దుల్ బారీ, ఏ5: అబ్దుల్ కరీం, ఏ6: శ్రవణ్‌కుమార్ (మారుతీరావు తమ్ముడు), ఏ7: శివ (మారుతీరావు కారుడ్రైవర్), ఏ8: నిజాం (ఆటోడ్రైవర్)కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం అప్పట్లో తీర్పు ఇచ్చింది.

## వైఎస్సార్ కడప జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్‌పై కాల్పులు



**దువ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దువ్వూరు మండలం జగనన్న కాలనీలో ఎర్రచందనం స్మగ్లర్ పై పోలీసుల కాల్పులు.. మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ జాకీర్ పై చాపాడు పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం కేసు.. జాకీర్ దువ్వూరు సమీపంలో ఉన్నాడన్న సమాచారంతో అర్ధరాత్రి సోదాలు నిర్వహిస్తుండగా పోలీసులపై తిరగబడ్డ స్మగ్లర్ .. అప్రమత్తమైన పోలీసులు స్మగ్లర్ పై కాల్పులు.. ఘటనలో స్మగ్లర్ జాకీర్‌కు గాయాలు.. స్మగ్లర్ జాకీర్ ను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలింపు..

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏఎస్ఆర్ జిల్లా డీఆర్వో లోకేశ్వరరావు



**పాడేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్) జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం భారీ దాడి నిర్వహించి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ - ఎఫ్ఏసీ) మారోతు వెంకట సూర్య లోకేశ్వరరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అమ్ము సూర్య చక్రవర్తికి సంబంధించిన జీతాల బకాయిలు, పెండింగ్ వార్షిక ఇంక్రిమెంట్లు మరియు పే స్కేల్ రెగ్యులరైజేషన్ బిల్లులు ఆమోదించడానికి డీఆర్ఓ లోకేశ్వరరావు రూ. 50,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఈ విషయంపై ఏసీబీ విశాఖపట్నం రేంజ్ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వ్యూహాత్మకంగా ప్లాన్ చేసిన ఏసీబీ బృందం, పాడేరు ఆర్‌డీవో కార్యాలయంలో బాధితుడి నుంచి రూ. 50,000 నగదును లోకేశ్వరరావు స్వీకరిస్తుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా స్వాధీనం చేసుకుంది. అనంతరం ఆయన చేతులకు రసాయన పరీక్షలు (కెమికల్ టెస్ట్) నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది.

### మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో

## కీలక నిందితుడు అరెస్ట్




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో కలకలం సృష్టించిన మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బెట్టింగ్ యాప్ స్కామ్‌కు సంబంధించి ప్రధాన నిందితుడు అభిషేక్ కుమార్‌ను శంషాబాద్ విమానాశ్రయంలో సీబీఐ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సమయంలో పక్కా సమాచారంతో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మహదేవ్ బుక్ ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం కార్యకలాపాలను నిర్వహించడం, బెట్టింగ్ ప్యానెల్స్‌ను సమన్వయం చేయడం, నిధులు సేకరించడం, దుబాయ్‌లో అక్రమ సంపాదనతో స్థిరాస్తులు కొనుగోలు చేయడంలో అభిషేక్ కుమార్ క్రియాశీలకంగా వ్యవహరించినట్లు సీబీఐ వెల్లడించింది. ఈ కుంభకోణంలో నిందితులైన సౌరభ్ చంద్రకర్, శుభమ్ సోనీలతో అభిషేక్‌కు ఉన్న సంబంధాలపై సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే దుబాయ్‌లోని ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫాలో ఉన్న ఒక విల్లాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. బెట్టింగ్ యాప్‌నకు ప్రమోటర్లుగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సౌరభ్, రవి ఉప్పల్ వ్యవహరించారు. ఈ యాప్‌నకు సంబంధించి మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా భారత్, దుబాయ్‌లో సౌరభ్ సంస్థలకు చెందిన రూ.1700 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. వాటిలో పలు విల్లాలు, ఖరీదైన ఇళ్లు ఉన్నాయి.

## మడకలవారిపల్లె సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

### రాత్రి 12 గంటల సమయంలో బైపాస్ హైవేపై ప్రమాదం



**ప్రొద్దుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రొద్దుటూరు నుంచి బద్వేల్ పరిసర ప్రాంతాలకు బండలు సరఫరా చేస్తూ వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ... ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న భాస్కర్ (50), రమణయ్య (60) అక్కడికక్కడే మృతి... మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను బద్వేల్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## ఉప్పొంగిన ఊర కాలువలు.. సంజీవయ్యనగర్ వాసులకు అవస్థలు



**గోకవరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** గత మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు గోకవరం పట్టణంలోని ఊర కాలువలు ఉప్పొంగాయి. ముఖ్యంగా సంజీవయ్యనగర్ ప్రాంతంలో ఊర కాలువలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు బయటకు రావాలన్నా, అత్యవసర పనులపై వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు మరికొంతకాలం కొనసాగితే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఊర కాలువ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. కాలువకు సరైన నిర్వహణ, నీటి ప్రవాహానికి అనుగుణంగా ఏర్పాట్లు లేకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అకస్మాత్తుగా కాలువలో నీటి ప్రవాహం పెరిగితే పరిస్థితి ఏంటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఊర కాలువను పరిశీలించి, నీటి ప్రవాహానికి శాశ్వత పరిష్కారం చూపాలని సంజీవయ్యనగర్ వాసులు కోరుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### గణపతి లడ్డు ప్రసాదాన్ని
## దక్కించుకున్న ఉమాపార్వతీశం సరిత దంపతులు



**కోరుకొండ, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం పశ్చిమ గోనగూడెంలో పురాతన దేవాలయం శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవం నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి గణపతికి తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామివారిని భారీ ఊరేగింపుతో నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి హస్తంలో తొమ్మిది రోజులు పాటు పూజలు అందుకున్న లడ్డు ప్రసాదాని వేలంపాటలో తొమ్మిది వేల రూపాయలకు యెజ్జు ఉమాపార్వతీశం సరిత దంపతులు చేజిక్కించుకున్నారు. లడ్డు ప్రసాదాన్ని ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా మా కుటుంబంకి దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని ఉమా పార్వతీశం సరిత దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. గణేష్ ఉత్సవాలు మన భారతదేశం సంస్కృతి, సాంప్రదా యాలతో పాటు ఐకమత్యం చాటు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## వర్షంలోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం

**కపిలేశ్వరపురం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కుండపోత వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు గురువారం కపిలేశ్వరపురం మండలంలో విస్తృతంగా పర్యటించి సుమారు రూ.10.85 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి వాకతిప్ప, యండగండి, పామర్రు, టేకి, శ్రీరాంపురం, మాచరమట్ల, నల్లూరు, నిడసనమెట్ట, కాలేరు, తాతపూడి, వడ్లమూరు, కపిలేశ్వరపురం గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, వాటర్ ట్యాంక్, పాఠశాల భవనాలు, మౌలిక వసతులకు సంబంధించిన పనులను ప్రారంభించారు. సాస్కి రుడా, 15వ ఆర్థిక సంఘం, పీఎంజీఎవై, జల్ జీవన్ మిషన్, మనబడి-మన భవిష్యత్ తదితర నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు చేయగా, మాచరమట్లలో నూతన ఎలిమెంటరీ పాఠశాల భవనాన్ని, కాలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన వంటగది, మౌలిక వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తోందని, మండపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపడమే తన లక్ష్యమని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండపేట, రాయవరం మండలాల్లో అనేక పనులు పూర్తి



చేశామని, కపిలేశ్వరపురం మండలంలో కొన్ని అభివృద్ధి పనులకు రాజకీయ కారణాలతో ఆటంకాలు ఎదురయ్యాయని ఆరోపించారు. ప్రజల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### సీతానగరం గ్రామంలో ముంపు ప్రాంతాల్లో
## పర్యటించిన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సీతానగరం గ్రామంలో గల పలు ముంపు ప్రాంతాల్లో రాజానగరం నియో జకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. వర్ష ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలను కలిసి,వర్షాల వల్ల వారు ఎదుర్కొం టున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు.పర్య టనలో భాగంగా సీతానగరం గ్రామంలో ఉన్న చెరువు వర్షపు నీటితో నిండి, పక్కనే ఉన్న కాలనీల వైపు ప్రవహిస్తుండటాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వయంగా పరిశీలించారు. సమస్య తీవ్రతను తక్షణమే గ్రహించిన ఆయన, స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. చెరువు పక్కన గండి కొట్టి పొంగి పొర్లుతున్న అదనపు నీటిని బయ టకు పంపించేలా వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. దీనివల్ల కాలనీ వాసులకు నీటి ముంపు నుంచి తక్షణ ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమ త్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థి తి వస్తే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు. ముంపు నీరు నిల్వ ఉండటం వల్ల ఎటువంటి అంటు వ్యాధులు వ్యాపించకుండా శానిటే షన్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు వేగవం తం చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట సీతా నగరం ఎమ్మార్వో , వివిధ శాఖల మండల అధికారులు, పోలీస్ అధికారులు, పంచాయతీ మరియు సచివాలయ సిబ్బంది, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయ కులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### రామచంద్రపురం మండల ప్రత్యేక అధికారిగా
## వి.అబ్రహాం లింకన్ బాధ్యతల స్వీకరణ



**రామచంద్రపురం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ మరియు డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ వి. అబ్రహాం లింకన్ రామచంద్రపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సెప్టెంబర్ 24 న బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలయ్యేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.పద్మజ్యోతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాస్, పరిపాలనాధికారి ఎం. శివప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవోలు పి. వీరభద్రరావు మరియు కార్యాలయ సిబ్బంది, మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొని ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఆంధ్రప్రదేశ్ 104 ఉద్యోగుల తొలగింపునకు
## నిరసనగా సమ్మెకు పిలుపు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ 104 వాహనాలలో పనిచేస్తున్న ఉద్యోగులను భవ్య యాజమాన్యం అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ సిఐటియు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా అక్టోబర్ 12 వరకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి, ఆ తర్వాత సమ్మెలోకి వెళ్లనున్నారు. నిరసన కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా అన్ని 104 వాహనాల సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అక్రమంగా తొలగించిన సిబ్బంది అందరినీ వెంటనే తిరిగి విధులోకి తీసుకోవాలని, డి.ఇ.ఓలకు రూ. 18,500 వేతనం చెల్లించాలని, గ్రామీణ ప్రాంతాలలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద ప్రజలకు అన్ని రకాల మందులు సమకూర్చడంతో పాటు సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 104 సిబ్బంది శ్రీను, చంద్రశేఖర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### మునికూడలిలో నూ అగ్రి ఎంటర్ప్రైజెస్ వ్యాపార సముదాయాన్ని
## ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు



**సీతానగరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నూ అగ్రి ఎంటర్ప్రైజెస్ సంస్థను రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రముఖుల సమక్షంలో ఘనంగా ప్రారం భించారు. వీరితో పాటు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత ప్రాంతాలలో రైతు లకు అవసరమైన ఆధునిక సాగు పరికరాలు మరియు బిందు సేద్య పరికరాలను స్థానికంగా అందుబా టులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు వాడటం వల్ల సాగునీటి వినియోగం తగ్గడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతుందని, రైతులకు ఇది ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్థ నిర్వా హకులు వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించి, రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగు దేశం, బిజెపి నాయకులు, కార్యకర్తలు , మరియు ముఖ్య ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

### మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు
## నాకు ఆదర్శం : యాట్ల నాగేశ్వరరావు



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు తనకు ఆదర్శమని నియోజకవర్గ ఎం.బి.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు తెలిపారు. అపూర్వమైన సామాజిక విప్లవానికి పునాది పడిందని, అట్టడుగు వర్గాల విముక్తి కోసం, ఆధిపత్య వర్గాల దోపిడి సంకెళ్ళను చేధించడం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా 1873 సెప్టెంబర్ 24 న సత్యశోధక్ సమాజ్ స్థాపించి నేటికి 153 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం నియోజకవర్గం ద్రాక్షారామ మసీదు సెంటర్లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే మరియు సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సత్యశోధక్ సమాజ్ అంటే సత్యాన్ని వెతికేవాడని అర్థం అని పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 24వ తేదీ నుండి 30వ తేదీ వరకు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సుబ్బారావు, మాచవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




భారీ వర్షాలు మరియు తుఫాను నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుతం కొనసాగుతున్న తుఫాను ప్రభావం, భారీ వర్షాలు, వరదల పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, అధికార యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనూ, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యవసర సేవల సమన్వయం కోసం ఆర్డీఓ పర్యవేక్షణలో సెప్టెంబర్ 24 నుండి 28 వరకు రామచంద్రపురం ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజలు అవసరమైతే కంట్రోల్ రూమ్ నంబర్ 08857-245166 ను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వాగులు, కాలువలు, చెరువులు, నదులు, కాజ్‌వేలు వంటి నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించడం ప్రమాదకరమని, నీరు ప్రవహిస్తున్న రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. పూరిగుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు లేదా ప్రమాదకర నిర్మాణాల్లో నివసిస్తున్న వారు తాత్కాలికంగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీటితో నిండిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని, భారీ గాలులు వీచే సమయంలో చెట్ల కింద లేదా పాత భవనాల వద్ద ఉండరాదని సూచించారు. ప్రజలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న నిర్ధారణ లేని వార్తలను నమ్మకుండా, అధికారిక శాఖలు విడుదల చేసే సమాచారం మరియు హెచ్చరికలను మాత్రమే విశ్వసించాలని కోరారు. ప్రతి కుటుంబం అత్యవసర మందులు, తాగునీరు, టార్చ్‌లైట్, మొబైల్ ఫోన్, పవర్ బ్యాంక్, ముఖ్య పత్రాలు తదితర అవసరమైన వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, అధికారులు జారీ చేసే సూచనలు, తరలింపు ఆదేశాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయం కోసం రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూమ్ నంబర్ 08857-245166, రామచంద్రపురం తహశీల్దార్ కార్యాలయం 9849903904, కే.గంగవరం తహశీల్దార్ కార్యాలయం 8008803197, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ 9849905772 లేదా అత్యవసర సేవల నంబర్లు 108 మరియు 112 లను సంప్రదించాలని కోరారు. అప్రమత్తతే రక్షణగా అధికారుల సూచనలు పాటించి సురక్షితంగా ఉండాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

జాతీయ బరవులెత్తుట పోటీలలో

# అమలాపురం యువకుడికి 6 పతకాలు



**అమలాపురం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే బరువులెత్తుట (పవర్ లిఫ్టింగ్) క్రీడలో శిక్షణ పొందుతున్న అమలాపురం పట్టణానికి చెందిన రాగిరెడ్డి శ్రవణ్ కుమార్ జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలలో ఏకంగా 6 పతకాలు సాధించి ఉభయ తెలుగు రాష్ట్రాలకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు గొప్ప పేరుప్రఖ్యాతులు తెచ్చిపెట్టారు. ఈ ఏడాది సెప్టెంబర్ 18, 19, 20 తేదీలలో ఢిల్లీ వేదికగా డబ్ల్యూపీఎస్ఓ మరియు డబ్ల్యూపీసీ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో, డబ్ల్యూపీసీ ఇండియా అధ్యక్షుడు దల్జీత్ సింగ్ పర్యవేక్షణలో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 67 కేజీల విభాగంలో పాల్గొన్న శ్రవణ్ కుమార్ అద్భుత ప్రతిభ కనబరిచి క్రింది పతకాలను సొంతం చేసుకున్నారు.

**సాధించిన పతకాల వివరాలు:**

రెండు పసిడి (స్వర్ణ) పతకాలు: తీవ్ర బైసెప్ కర్ల్, తీవ్ర ఓవర్‌హెడ్ ప్రెస్

మూడు వెండి (రజత) పతకాలు: కచ్చిత బైసెప్ కర్ల్, కచ్చిత ఓవర్‌హెడ్ ప్రెస్, బెంచ్ ప్రెస్

ఒక కంచు (కాంస్య) పతకం: బరువును నేల నుండి పైకి ఎత్తే విభాగంలో (డెడ్‌లిఫ్ట్) 162.5 కేజీల బరువు ఎత్తి కంచు పతకం కైవసం చేసుకున్నారు.

ప్రస్తుతం భాగ్యనగరం (హైదరాబాద్)లో ఉద్యోగం చేస్తున్న శ్రవణ్ కుమార్, పని ఒత్తిడి ఉన్నప్పటికీ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర సాధన చేసి ఈ విజయాన్ని అందుకోవడం విశేషం. తన విజయంపై శ్రవణ్ కుమార్ స్పందిస్తూ తన క్రీడా ప్రయాణానికి అండగా నిలిచిన లూసిడ్ ప్రయోగశాలల యాజమాన్యానికి, ఆ సంస్థ దర్శకులు (డైరెక్టర్లు) యుగంధర్, చెల్లారావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే సహకారం అందించిన తెలంగాణ డబ్ల్యూపీసీ అధ్యక్షురాలు ఇంటూరి రేఖకు, తన సహోద్యోగులు ఉదయ్, విజయ్‌లకు, ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని దేశానికి మరిన్ని పతకాలు తీసుకురావడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి జాతీయ స్థాయిలో రాణించిన శ్రవణ్ కుమార్‌ను పలువురు క్రీడాభిమానులు, ప్రముఖులు, కోనసీమ వాసులు కొనియాడారు.

# అక్టోబర్ 1న పింఛన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

## జిల్లాకు రూ.83.35 కోట్ల పింఛను నిధులు విడుదల : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్టోబర్ 1వ తేదీన పింఛన్ల పంపిణీని సజావుగా, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. సెప్టెంబర్ 2026 నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ కోసం జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు మొత్తం రూ.83.35 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ఉదయం సంబంధిత బ్యాంకు శాఖల నుంచి అవసరమైన పింఛను నగదును ఉపసంహరించుకుని, మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

**బ్యాంకుల్లో నగదు అందుబాటులో ఉండేలా చర్యలు**

పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదు అక్టోబర్ 1వ తేదీ ఉదయానికే సంబంధిత బ్యాంకు శాఖల్లో అందుబాటులో ఉండేలా అన్ని బ్యాంకు కంట్రోలర్లు, ఎల్‌డీఎంలకు ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులు సంబంధిత బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుని నగదు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

**పింఛనుదారులకు ముందస్తు సమాచారం**

ప్రతి పింఛనుదారునికి పంపిణీ తేదీ, సమయంపై ముందుగానే సమాచారం అందేలా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కూడా ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. పింఛనుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

# కూటమి సత్తా చాటాలి

వైసీపీ ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం ఎంపీటీసీలు బలంగా నిలబడ్డారు

పదవీకాలం ముగిసిన తెలుగుదేశం ఎంపీటీసీలను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సత్తా చాటాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు ఎన్నికలు అరాచకాలు బెదిరింపులతో సాగాయని అయినా తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీటీసీలుగా పలువురు ప్రజాభిమానంతో విజయం సాధించి తమ సత్తా చాటారన్నారు. గురువారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో ఇటీవల పదవీకాలం ముగిసిన తెలుగుదేశం ఎంపీటీసీలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘనంగా సత్కరించారు. ఆత్రేయపురం మండలం నుంచి ఉచ్చిలికి చెందిన మట్టా లక్ష్మి, రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన సకినాల నాగజ్యోతి గణపతి, కేతరాజుపల్లి కి చెందిన పమ్మి శాంతి కుమారి, వెదిరేశ్వరం కు చెందిన గంటా సుబ్బారావు, ఆలమూరు మండలం ఆలమూరుకు చెందిన గంగుల నాగజ్యోతి, జొన్నాడకు చెందిన మారిశెట్టి శ్రీనివాస్, కొత్తపేట మండలం మోడేకుర్రుకు చెందిన రెడ్డి శ్రీనివాస్, మందపల్లి కి చెందిన సిద్ధంశెట్టి సత్యనారాయణ, వానపల్లికి చెందిన మాకే నాగభూషణం, బల్ల సుధారాణి, బిల్లకుర్రుకు చెందిన చిత్రపు ఆనంద్ లను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో స్థానిక సంస్థల ప్రతినిధులకు ఎటువంటి ప్రాధాన్యత లేదని, గ్రామాల్లో ఏ విధమైన అభివృద్ధి జరగలేదని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక రెండు సంవత్సరాల్లో గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా స్థానిక సంస్థల ప్రతినిధులకు ఈ రెండేళ్ల కాలంలో ప్రజల నుంచి తగినంత గౌరవం దక్కిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానాన్ని కూటమి అభ్యర్థులే గెలుచుకోవాలని దిశా నిర్దేశం చేశారు.

పేద ప్రజల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న అభిమానానికి నిదర్శనంగా

# ముఖ్యమంత్రి సహాయనిధి కార్యక్రమం నిలుస్తుంది

**నాలుగు మండలాలకు చెందిన 125 మందికి రూ.62,44,112ల విలువైన చెక్కుల అందజేత**

**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1958 మందికి ఇప్పటికే 40 దఫాల్లో రూ.12,43,63,630ల విలువైన చెక్కులను అందజేశామన్న బండారు**



**రావులపాలెం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని, పేద ప్రజల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న అభిమానానికి నిదర్శనంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గురువారం కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెక్కులను అందజేశారు. ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ మంత్రి నారా లోకేష్ ల ఆధ్వర్యంలో ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని కొనియాడారు. మన నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో సహాయ నిధి చెక్కులను ముఖ్యమంత్రి అందిస్తున్నారని కొనియాడారు. ఆసుపత్రి బిల్లులను బట్టి ఎంతవరకు సహాయం అందజేయాలో అంతవరకు సహాయం అందజేస్తున్నారన్నారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడ్డ పేద కుటుంబాలను ఆదుకోవాలని సంకల్పంతో ముఖ్యమంత్రి సహాయం అందిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మన నియోజకవర్గంలో ఇప్పటికే 40 దఫాలుగా రూ.12,43,63,630ల విలువైన చెక్కులను 1958 మందికి అందజేశామన్నారు. వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి అనేది పేదలకు అందని ద్రాక్షగా ఉండేదని, తమకు కావలసిన వారికి మాత్రమే ఒకరో,ఇద్దరికో దక్కేదని విమర్శించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ఇంత పెద్ద మొత్తంలో సహాయం ఏనాడూ అందలేదన్నారు. ఇంకా పెండింగ్లో ఉన్న చెక్కులను సైతం త్వరలోనే మంజూరు అయ్యేలా మాట్లాడడం జరిగిందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో నియోజకవర్గంలో పేదలకు సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 25మందికి రూ.9,99,982లు, రావులపాలెం మండలానికి చెందిన 40మందికి రూ.2,137,358లు, కొత్తపేట మండలానికి చెందిన 37మందికి రూ.16,62,025లు, ఆలమూరు మండలానికి చెందిన 23 మందికి రూ.14,44,747లు మొత్తం 125 మందికి రూ.62,44,112ల విలువైన చెక్కులను అందజేశారు. మొత్తం 125 చెక్కుల్లో 123 రీయింబర్స్మెంట్ కాగా ఎల్వోసీలు 2 ఉన్నాయి.

రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లో

# ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుత తుఫాను మరియు భారీ వర్షాల పరిస్థితుల నేపథ్యంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజల భద్రతకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అత్యవసర సేవల కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి పర్యవేక్షణలో, ఆర్డీఓ కార్యాలయంలో సెప్టెంబర్ 24 నుండి 28 వరకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08857-245166 గా అందుబాటులో ఉంటుంది. భారీ వర్షాల సమయంలో ప్రజలు పాటించాల్సిన ముఖ్యమైన సూచనలు, అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దు. వర్షాలు తగ్గే వరకు సురక్షిత ప్రదేశాల్లో ఉండాలి. వాగులు, కాలువలు, చెరువులు, నదులు, కాజ్‌వేలు మరియు నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు వెళ్లవద్దు. నీటి ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించకూడదు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించవద్దు. రహదారిపై నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలను నీటిలోకి తీసుకెళ్లడం ప్రమాదకరం. పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు లేదా ప్రమాదకరమైన నిర్మాణాల్లో నివసిస్తున్న ప్రజలు వర్షాలు తగ్గే వరకు సురక్షితమైన ప్రాంతాలకు తరలివెళ్ళాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో ఉన్నవారిని ప్రత్యేకంగా జాగ్రత్తగా చూసుకోవాలి. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, నీటితో నిండిన విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి. తెగిపోయిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు. భారీ గాలులు, వర్షాల సమయంలో చెట్ల కింద, పాత భవనాలు మరియు శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల వద్ద ఉండకూడదు. అత్యవసర పరిస్థితుల్లో 108 లేదా 112 వంటి సేవలను సంప్రదించడంతో పాటు, రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూమ్ 08857-245166 కు సమాచారం అందించాలి. అధికారిక శాఖలు విడుదల చేసే సమాచారం మరియు హెచ్చరికలను మాత్రమే విశ్వసించాలి. సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని వార్తలను నమ్మవద్దు లేదా ప్రచారం చేయవద్దు. ఇంట్లో అత్యవసర మందులు, తాగునీరు, టార్చ్‌లైట్, మొబైల్ ఫోన్ లేదా పవర్ బ్యాంక్, అవసరమైన పత్రాలు మరియు పిల్లలు, వృద్ధులకు అవసరమైన వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలి. భారీ వర్షాల సమయంలో అనవసర ప్రయాణాలను నివారించి, అధికారులు సూచించిన మార్గాలను మాత్రమే ఉపయోగించాలి. అధికారులు తరలింపు సూచనలు జారీ చేసినప్పుడు ప్రజలు వాటిని నిర్లక్ష్యం చేయకుండా సహకరించాలి. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులు సమన్వయంతో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అధికారుల సూచనలు పాటిస్తూ, అత్యవసర సమాచారం కోసం రామచంద్రపురం కంట్రోల్ రూమ్ నంబర్ 08857-245166, తహశిల్దారు కార్యాలయం రామచంద్రపురం 9849903904, తహశిల్దారు కార్యాలయం కే.గంగవరం 8008803197, మునిసిపల్ కమీషనర్ రామచంద్రపురం 9849905772 నంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.

# ఎంపీటీసీ సఖినాల నాగజ్యోతి గణపతికి ఘన సన్మానం



**రావులపాలెం, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం పొడగట్లపల్లి ఎంపీటీసీగా గెలుపొంది పదవి కాలం పూర్తి అయినాసందర్భంగా పొడగట్లపల్లి కూటమి అభ్యర్థులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు .ఈకార్యక్రమంలో సకినాల నాగజ్యోతి గణపతి దంపతులకు పూలదండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సకినాల నాగజ్యోతి గణపతి దంపతులుమాకు అంత ఘనవిజయాన్ని ఇచ్చి ఎంపీటీసీగా గెలుపొందించి బాధ్యతలు పూర్తి చేసుకున్న సందర్భంగా మమ్మల్ని ఆశీర్వదించడానికి వచ్చిన ప్రతి కార్యకర్తకు పొడగట్లపల్లి గ్రామ ప్రజలకు మేము ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అందరికీ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వర్షాలు తగ్గు ముఖం పట్టే వరకు అప్రమత్తంగా వ్యవహరించండి

## జిల్లా కలెక్టర్‌కు ఉపముఖ్యమంత్రి ఆదేశాలు





**కాకినాడ, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** లోతట్టు ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు.గురువారం కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం ఎస్ హరేంద్రర ప్రసాద్ తో వీడియో కాన్ఫరెన్స్ లో కాకినాడ జిల్లాలోని వర్షాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గురువారం ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉన్న రోడ్లపై కూలిన చెట్లను తక్షణం తొలగించి రాకపోకలు పునరుద్ధరించండని ఆదేశించారు. నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు డీ వాటరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించినట్లు కలెక్టర్ వెల్లడించారు.తక్షణం పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని, అలాగే ఆస్తి నష్టం జరిగిన చోట తక్షణం పరిహారం అందించే ఏర్పాట్లు చేయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌తో సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లాలో ప్రస్తుత స్థితిగతులు, తీసుకుంటున్న చర్యలను సవివరంగా వివరించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ పిఠాపురం నియోజకవర్గం లో సుద్దగడ్డ వాగు ముంపుపై ఆరా తీశారు.ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులు కూడా ఆయన అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి తీవ్ర వాయు గుండం ప్రభావం తో గత రెండు రోజులుగా కాకినాడ జిల్లా వ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండడం తో యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించా లని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గు ముఖం పట్టే వరకు లోతట్టు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, వరద ముంపు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అవసరం అయితే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కాకినాడ జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా సమీక్షించారు. రెండు రోజులుగా ఎడ తెరిపి లేకుండా వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లోనీటిమట్టాలు, విద్యుత్ సరఫరా, తాగు నీటి వ్యవస్థ, పంట నష్టం, మత్స్యకారుల భద్రత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు కూలగా అగ్నిమాపక సిబ్బంది సహకారంతో తక్షణం తొలగించామని, ప్రాథమిక అంచనాల మేరకు కాకినాడ జిల్లావ్యాప్తంగా 1,885 హెక్టార్లలో పంట దెబ్బ తిందని కాకినాడ కలెక్టర్ హరేందర్ ప్రసాద్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ఈ సందర్భంగా వివరించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్లను ఏర్పాటు చేసి శాఖల వారీగా పరిస్థితిని 24 గంటలు సమీక్షిస్తున్నట్టు, ప్రస్తుతం పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నట్టు కలెక్టర్ హరేంద్రర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వరద ముంపు,సహాయక చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇంకా భారీ వర్షాలు కురుస్తుండడం తోపాటు ఆకస్మిక వరద ముప్పు పొంచి ఉన్న హెచ్చరికలు ఉండడం వల్ల లోతట్టు ప్రాంతాలు, ముంపు పొంచి ఉన్న గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణకు అంతరాయం లేకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా పంపుల వినియోగించి ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని, ఈదురు గాలుల కారణంగా రహదారులపై కూలిన చెట్లను తక్షణం తొలగించి రాకపోకలకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి.అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా, తాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా పరిధిలోనే ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసర మైనప్పుడు దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలుఇవ్వాలనన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతులకి తక్షణం సహాయం అందేలా చూడాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితిని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అడిగి తెలుసు కున్నారు.వాయు గుండం ప్రభావం పూర్తిగా తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరికలు అమలు చేయాలన్నారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలో సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటి కప్పుడు నివేదిక పంపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు జిల్లా యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# కాకినాడలో భారీ వర్షాలు ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

## క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ సత్యనారాయణ - ముమ్మరంగా సహాయక చర్యలు

**కాకినాడ, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో ముంపు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ స్వయంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గురువారం కమిషనర్ సత్యనారాయణ పూలేపాకలు, పర్లోవపేట, మహాలక్ష్మీనగర్, పద్మనాభనగర్, బాపూజీనగర్, అయోధ్యనగర్, కొత్తకాకినాడ, ప్రతాపనగర్, సాంబమూర్తినగర్, రెవెన్యూ కాలనీ తదితర ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటిని త్వరితగతిన తొలగించడం, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించడం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్.ఈ. పి. వెంకట్రావు, ఈఈ కనకరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, అర్బన్ తహశీల్దార్ వి. జితేంద్రతో పాటు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.



### 12 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు

ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నగరంలో 12 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని బట్టి ప్రజలను సురక్షితంగా ఆయా పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన సమయంలో అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

### నేలకొరిగిన వృక్షాల తొలగింపు

భారీ వర్షాలతో పాటు వీచిన ఈదురు గాలులకు నగరం లోని పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రహదారులపై ఏర్పడిన అడ్డంకులను తొలగించేందుకు ఉద్యానవన విభాగం సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉద్యానవన శాఖ ఏ డి శ్రీనివాసరావు నేతృత్వంలో సిబ్బంది ఎప్పటి కప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నేలకొరిగిన వృక్షాలను తొలగిస్తున్నారు. రహదారులపై పడిన చెట్లను వెంటనే తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### అధికారులకు కమిషనర్ సత్యనారాయణ ఎప్పటికప్పుడు ఆదేశాలు

వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడ నీరు నిలిచినా వెంటనే తొలగించడం, అవసరమైన చోట మోటార్లను ఏర్పాటు చేయడం, ముంపు ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, విద్యుత్, పారిశుద్ధ్యం, రహదారులు తదితర అంశాల్లో సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను

# పర్యవేక్షించిన సిటీ ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాకినాడ పట్టణం లోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో కాకినాడ సిటీ శాసనసభ్యుడు వనమాడి కొండబాబు గురువారం ముంపుకు గురైన లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలకు ఏర్పాటు చేయవలసిన పునరావాస కేంద్రాలు ఆహార ఏర్పాట్లుపై అధికారులతో ఎన్డీఏ కూటమి శ్రేణులతో పర్యవేక్షించారు. ఆయన పూలేపాకులు, పరలోవ పేట, కుంభాభిషేకం రేవు, దుమ్ములపేట, అయోధ్య నగర్, కొత్త కాకినాడ, ప్రాంతాలలో పర్యటించి ముంపుకు గురైన ప్రాంతాలను ఇళ్లలోకి వర్షపు నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. వర్షపు నీరు ఇళ్లలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వెంటనే అధికారులను అప్రమత్తం చేసి స్థానిక ప్రజలకు అందించవలసిన ఏర్పాట్లుపై పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని, ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాల్లో కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికార యంత్రాంగం, ఎన్‌డిఏ కూటమి శ్రేణులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా ఆదేశించడం జరిగిందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రజలకు భరోసా ఇచ్చారు.వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన వారికి పునరావాస కేంద్రాల్లో వసతి, భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, స్థానిక నాయకులు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, సికోటి అప్పలకొండ, తుమ్మల సునీత, ఏరిపిల్లి రాము, బడే సత్యారావు, గంపల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలలో

# ఎమ్మెల్యే పంతం నానాజీ సుడిగాలి పర్యటన



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు( నానాజీ) గత మూడు రోజుల నుండి తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల కాకినాడ రూరల్ లో కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. గత వైసిపి పాలకులు చేసిన తప్పుదాల వల్ల డ్రైనేజ్ సిస్టం సరిగ్గా లేకపోవడం వల్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. తిమ్మాపురం గ్రామంలో మరియు వాకలపూడి గ్రామంలో ముంపు ప్రాంతంలో ఉన్న ప్రతి కుటుంబానికి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

# తుఫాను ప్రభావంతో తుని నియోజకవర్గంలో ఎడతెరిపి లేని వర్షాలు

## వర్షాభావ పరిస్థితులపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే దివ్య



**కోటనందూరు, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తుని నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వ విప్ యనమల దివ్య సమీక్షించారు. రెవిన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మండల పరిషత్, వ్యవసాయ శాఖ తదితర అధికారులతో నిరంతరం సమీక్ష చేస్తూ సహాయక చర్యలపై యనమల దివ్య దిశానిర్దేశం చేసారు.యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వర్షాల వల్ల ముంపు బారిన పడ్డ లోతట్టు ప్రాంతాల ప్రజలకు భోజన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.వర్షాలకు వాగులు వంకల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించిన ఆమె పంటలు ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జలమైన రోడ్లు పై వర్షం నీరు నిల్వ ఉండకుండా పంచాయితీ రాజ్, రోడ్లు భవనాల శాఖ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులును ఆదేశించారు. నియోజకవర్గంలోప్రతి గ్రామ పరిస్థితులపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్న యనమల దివ్య ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రజలకు తోడుగా నిలవాలని ఆమె కూటమి శ్రేణులను ఆదేశించారు. అలాగే తుని మున్సిపాల్టీ పరిధిలో ముంపు నివారణపై నిరంతరం మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే యనమల దివ్య సమీక్ష నిర్వహించారు. ఈమె ఆదేశాల మేరకు ప్రధానమైన మురికి కాల్వల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉన్నందున విపత్తును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని ఆమె ఆదేశించారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పర్యవేక్షించిన ప్రత్యేక అధికారి

## వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి : ప్రత్యేక అధికారి రమణారెడ్డి



**కోటనందూరు, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు మండల ప్రజాపషత్తు ప్రత్యేక అధికారి అయినా ఏ రమణారెడ్డి మండలంలోని కోటనందూరు, అల్లిపూడి, కే ఏ మల్లవరం, పీ కొట్టాం, కే కొట్టాం, ఎల్.డిపేట, కాకరాపల్లి మరియు కేవో అగ్రహారం గ్రామంలో తుఫాను పరిస్థితులను గమనించారు. గ్రామంలో గల చెరువులు కాలువలు ఏమైనా గండి పడిన పంటలకు ఏమైనా నష్టం వాటిల్లినదా మొదలైన పరిస్థితులను గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆయా గ్రామాలలో తిరిగి తెలుసుకున్నారు. తుఫాను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో పారిశుధ్యం మెరుగుగా ఉండాలని మంచినీటి సౌకర్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జెసిబిలను ఏర్పాటు చేసుకోవాలని జనరేటర్స్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలియజేశారు. రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రతి సచివాలయం నందు ప్రత్యేక తుఫాను కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసుకోవాలని ప్రాణహాని జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ప్రత్యేక అధికారి వారి వెంట మండల పరిషత్తు అభివృద్ధి అధికారి పి వెంకటనారాయణ, తాహసిల్దార్ బి రాజు, డిప్యూటీ ఎంపీడీవో ఎస్ జయరామ్, అలాగే ఏఈఆర్డబ్ల్యూస్ ఏఈ, పీఆర్ వారు ఉన్నారు.

# జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పోక్సో బాధితురాలు

## పరామర్శించిన ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యులు గంగ సూర్య నారాయణ



**కాకినాడ, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన పోక్సో కేసులో బాధితురాలైన ఎనిమిదేళ్ల బాలిక ప్రస్తుతం కాకినాడలోని వన్ స్టాప్ సెంటరులో తాత్కాలిక సంరక్షణ పొందుతోంది. ఈ నేపథ్యంలో గురువారం తాళ్లరేవు గ్రామానికి చెందిన నడింపల్లి వినోద్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీఎస్‌సీపీసీఆర్) సభ్యులు గంగ సూర్యనారాయణ ఆ బాలికను పరామర్శించారు. ఈ సందర్భంగా బాలిక ఆరోగ్య పరిస్థితి, సంక్షేమం, భద్రత ఆమెకు అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికకు అవసరమైన విద్య, వైద్యం, మానసిక సహాయం, ఇతర పునరావాస సేవలను ప్రభుత్వం ద్వారా అందించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకుంటాయని తెలిపారు. ఈ క్లిష్ట పరిస్థితిలో బాలికకు అవసరమైన అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా తగిన భరోసా కల్పించారు. అనంతరం చట్ట విరుద్ధ దత్తతకు సంబంధించిన కేసులో భాగంగా శిశు గృహంలో తాత్కాలిక సంరక్షణ పొందుతున్న మూడు నెలల వయస్సు గల శిశువు అనారోగ్య సమస్యతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ శిశువును ఈ సందర్భంగా ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యులు గంగ సూర్య నారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించి శిశువు ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలు, కొనసాగుతున్న చికిత్స తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. శిశువుకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు, నిరంతర వైద్య పర్యవేక్షణ, ప్రత్యేక సంరక్షణ అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్య బృందాన్ని కోరారు. శిశువు ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య, పోషణ, సంరక్షణ సేవలను సంబంధిత శాఖల సమన్వయంతో అందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జాగరపు విజయ, వన్ స్టాప్ సెంటర్ నిర్వాహకులు శైలజ, చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయ కర్తలు, విజయ్, నాగలక్ష్మి, కేసు వర్కర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడు అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు



**కోటనందూరు, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** 12 సంవత్సరాల బాలుడు అదృశ్యమైన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై టీ.రామకృష్ణ తెలియజేశారు. కాకినాడ జిల్లా కోటనందూరులో భద్రంపేటకు చెందిన 12 సంవత్సరం ల బాలుడు మామిడి ఉపేంద్ర 2 రోజుల క్రితం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బాలుడు తల్లి మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసినదని, బాలుడు కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడని, చదువుపై ఆసక్తి లేకపోవడంపై ఇంటి నుండి వెళ్లిపోయి ఉండవచ్చని బాలుడు తల్లి అభిప్రాయపడిందని, అదృశ్యమైన సమయంలో నీలం రంగు ఫుల్ ప్యాంటు, బ్రౌన్ కలర్ టీ షర్టు ధరించాడని, ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్ కు మరియు 944090073 ఎస్సై గారికి సమాచారం తెలియజేయాలని ఎస్ఐ టి.రామకృష్ణ తెలియజేశారు.

కురుస్తున్న వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో కూడా

# వరి సాగుకు అనుకూలం

## 80 శాతం రాయితీపై మినుములు, పెసలు, జనుము, గడ్డి విత్తనాలు
## వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్



**కోటనందూరు, సెప్టెంబర్ 24, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల కురుస్తున్న వర్షాలతో కోటనందూరు మండలంలోని తాండవ ఆయకట్టు మెట్ట ప్రాంతాల్లో సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలోని ఇండుగుపల్లి, బిళ్లనందూరు, సూరపురాజుపేట గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారి కె.జె. చంద్రశేఖర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగు పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి ప్రస్తుత సాగు పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఎలినినో ప్రభావం కారణంగా తుఫాన్‌కు ముందు వరకు సుమారు 3,500 ఎకరాల్లో వరి సాగుకు అనుకూల పరిస్థితులు లేకపోయాయని తెలిపారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో సుమారు 2,500 ఎకరాల వరకు వరి సాగుకు అనుకూలంగా మారినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైందన్నారు.వర్షాల కారణంగా మండలంలోని చెరువులు నిండడంతో రైతులు వరి సాగుపై ఆసక్తి చూపుతున్నారని చంద్రశేఖర్ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి నారు తెచ్చుకుని నాట్లు వేయడంతో పాటు, బయటి ప్రాంతాల నుంచి స్వల్పకాలిక రకాల విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని చెప్పారు.

### ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి....

మిగిలిన సుమారు 1,500 ఎకరాల్లో ఎలి నినో ప్రభావం కారణంగా వరి సాగు అనుకూలంగా ఉండకపోవచ్చని, ఆయా భూములకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులకు మినుములు, పెసలు, జనుము, గడ్డి విత్తనాలను 80 శాతం రాయితీపై అందించేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు.రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుని వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఏహెచ్ శ్రీను, వీఏఏ శివాజీ పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

**24 గంటలూ అందుబాటులో నియంత్రణ కేంద్రం**

**ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలి : కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. గురువారం నగరంలోని వెస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీపేట తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. వర్షపు నీరు ఎక్కడా నిలిచిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రధాన కాలువలు, మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన వ్యవస్థలు కూడా అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న ప్రకటనల ఫలకాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. భారీ వర్షాలు, గాలుల కారణంగా చెట్లు కూలిన ప్రాంతాల్లో వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని చెప్పారు. అవసరమైన ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను ముందుగానే కత్తిరించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 9494060060 నియంత్రణ కేంద్రం 24 గంటలూ పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాలకు సంబంధించిన సమస్యలు తలెత్తితే ప్రజలు ఈ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు అధికారులు తక్షణమే స్పందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని రాహుల్ మీనా సూచించారు. నగరపాలక సంస్థ చేపట్టే సహాయక చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్యనిర్వాహణ ఇంజినీర్ మాధవి, వైద్య ఆరోగ్య అధికారి వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సుంకర చంద్రరావు కాలనీలో కాలువలను తలపిస్తున్న వర్షపునీరు

**రెండేళ్లు గడుస్తున్న నెరవేరని శాసనసభ్యుల హామీ - శిలాఫలకాలికే పరిమితమవుతున్న డ్రైనేజీలు**



**కోరుకొండ, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం పశ్చిమగోనగూడెం సుంకరచంద్రరావు కాలనీలో ఇటీవల మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీలో పలువీధులు కాలువలను సైతం తలపించేలా వర్షంనీరు నిలవ ఉండడంతో ఇంటి లోపల నుంచి బయటికి రావడానికి మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గురువారం కురిసిన వర్షం కారణంగా సుంకర చందద్రావు కాలనీ, రాధాకృష్ణ నగర్ లోని పలు వీధులలో వాడకంనీరు ,వర్షపునీరు పోవడానికి డ్రైనేజీ వ్యవస్థ లేక నీరు అంతా రోడ్డు మీద నిలవడంతో దోమలకు, పందులకు నిలయాలుగా మారుతున్నాయని, తద్వారా తమకు పలు వ్యాధులు వ్యాపిస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సుమారు రెండేళ్ల క్రిందట రాత్రివేళ సుంకర చంద్రరావు కాలనీ, రాధాకృష్ణ నగర్ లో పర్యటించి డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తానన్న ఇచ్చిన హామీకి రెండేళ్లు దాటుతున్న నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అదేవిధంగా పల్లె వెలుగు 1.0 కార్యక్రమంలో 20లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి,పనులను అటకెక్కించార న్నారు. అదేవిధంగా ఇటీవల పల్లె వెలుగు 3.0 లోను డ్రైనేజీలకు లక్షలాది రూపాయలు నిధులు మంజూరు చేసామని, ఇచ్చిన హామీ నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు. దీంతో రాధాకృష్ణ నగర్ లోని పలు ప్రాంతాలు మురుకుకుపాలుగా మారి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా నేషనల్ హైవేకి పక్కనే ఉన్న "స్మశాన వాటిక"అభివృద్ధికి నోచుకోవడం లేదని, వర్షం వస్తే భౌతిక కాయాన్ని తీసుకువెళ్లే మార్గమే లేని దుస్థితిలో గ్రామం ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో పశ్చిమ గోనగూడెం గ్రామం అభివృద్ధికి ఆమడదూరం ఉందని చెప్పక తప్పదని, జనసేన తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కాలనీలపై నిర్లక్ష్యం వ్యక్తం చేస్తున్నట్లు పలువురు మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ,రుడా చైర్మన్ బొడ్డు వెంకటర మణ చౌదరి తమ గ్రామం పై దృష్టి సారించి, డ్రైనేజీ, స్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

# ఐదేళ్ల సేవలకు ఘన వీడ్కోలు

**మండల పరిషత్ పాలకవర్గ సభ్యులకు సత్కారం**



**గోకవరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండల పరిషత్ పాలకవర్గ ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ గోవిందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగతో పాటు పాలకవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు పదవీకాలంలో మండల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సభ్యులకు నిధులు మంజూరు చేయడంలో చొరవ చూపారని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మండల అభివృద్ధికి కృషి చేసిన పాలకవర్గాన్ని అభినందించారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు మాట్లాడుతూ.. ఐదేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సమన్వయం, సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేశామని చెప్పారు. ఐదేళ్ల పదవీకాలం సంతృప్తికరంగా ముగిసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, ఎంపీటీసీలు తోలేటి రమ్యశ్రీ, గళ్లా కృష్ణ, కోట సత్యవతి, స్థానిక నాయకులు పాటి రాంబాబు, దాసరి చిన్నబాబు, సుంకర వెంకటరమణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# కాకుమాను రాజశేఖర్ మృతికి సంతాపం

**వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్**

**మండపేట టౌన్, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన రాజశేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజశేఖర్ మరణం పార్టీకి, ఆయనను అభిమానించే వారికి తీరని లోటని అన్నారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.రాజశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోస్థైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని పలివెల సుధాకర్ ప్రార్థించారు.

# జోరువానలోనూ హోరెత్తిన గణపతి నిమజ్జనాలు



**కోరుకొండ, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని కోరుకొండ పశ్చిమ గోనగూడెం శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో జోరు వానలోనూ గణపతి నిమజ్జనాలు హోరెత్తించారు. గురువారం కోరుకొండ మండలంలో జోరుగా కురుస్తున్న వర్షంలోనూ పెద్ద ఎత్తున డీజేలు, కుర్రకారు విన్యాసాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తూ గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీచేసి, ఊరేగింపులకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

**పార్టీ నాయకులతో**

# మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమీక్ష

**కమిటీల ఎంపికపై కొనసాగుతున్న కసరత్తు**



**సీతానగరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలో వైఎస్సార్‌సీపీ అను బంధ కమిటీల నియామకంపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కం పూడి రాజా ముమ్మర కసరత్తు చేపట్టారు. గురువారం సీతానగరంలో డాక్టర్ బాబు నివాసం వద్ద ముఖ్య నాయకులతో కమిటీల నియామకంపై సుదీర్ఘంగా చర్చించారు.అన్ని వర్గాలకు అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకొంటున్నట్లు రాజా తెలిపారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూ చించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును ప్రజలకు వివరిం చాలని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. గ్రామాల వారీగా రిజర్వేషన్ల ను అనుసరించి నాయకు లంతా సమిష్టి నిర్ణయంతో సమర్థవం తమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.పార్టీ కోసం కష్ట పడుతున్న ప్రతి కార్యకర్తకు, నాయకుడికి రానున్న రోజుల్లో తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని రాజా భరోసా ఇచ్చారు. కార్యకర్త లకు ఎలాంటి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు.

# కోరుకొండ మండల ప్రత్యేక అధికారిగా దేవరకొండ



**ఎంపీడీవో, సిబ్బంది అభినందనలు**

**కోరుకొండ, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం ప్రత్యేక అధికారిగా దేవరకొండ శ్రీనివాసరావు నియమితుల య్యారు. గురువారం శ్రీనివాసరావు మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, సామ్యూల్ బాబు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలియ జేశారు. కోరుకొండ మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన శ్రీనివాసరావు ప్రస్తుతం మండలంలోని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# నందివాడ వారి వీధిలో ఘనంగా అన్న సమారాధన

**వర్షంలోనే గణనాథుని ఊరేగింపు... నిమజ్జనోత్సవం**







**రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 23వ డివిజన్లో ఉన్న నందివాడ వారి వీధిలో శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం వారి శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగిసాయి. శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలలో మాజీ కార్పొరేటర్, చందా సత్రం మాజీ చైర్మన్ వాకచర్ల కృష్ణ సూర్య కుమారి దంపతులచే పూజ కార్యక్రమాలు జరిగాయి.పురోహితులు బోడెం రవి కుమార్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులందరికీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. 5000 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం లడ్డు వేలం పాట ఉత్సాహంగా జరిగింది. సాయంత్రం 4 గంటలకు వర్షంలోనే గణనాథుడిని ఊరేగింపు ఊరేగింపుగా తీసుకుని వెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశరావు, జక్కంపూడి రాజా, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, చాంబర్ మాజీ అధ్యక్షులు అశోక్ కుమార్ జైన్, నిమ్మలపూడి గోవింద్, శెట్టి జగదీష్, దూర్వాసుల సత్యనారాయణ, ఉదయభాస్కర్, మద్ది నారాయణరావు, పెంటపాటి సుభాష్, సాయిబాబు, అక్షయపాత్ర శ్రీనివాస్,న్యాయవాది ధర్మ, మాజీ కార్పొరేటర్ ఇన్నమూరి రాంబాబు, ద్వారా పార్వతి సుందరి,అందనాపల్లి సత్యనారాయణ, పెదిరెడ్ల శ్రీనివాస్, పొత్తూరి యతిరాజ్ సంపత్ కుమార్, పొత్తూరి వెంకట సత్యనారాయణ, చుండూరి యోగా నరసింహస్వామి, పేరూరి మహేంద్రనాథ్, సరిదే ధన వెంకటేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, మారడుగుల సుబ్బయ్య, వానపల్లి మురళీకృష్ణ, నంబూరి కృష్ణ చైతన్య, సోమిశెట్టి భీమేశ్వరరావు, జ్యోతి రామ్ విఠల్ మోరే, వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ హాజరయ్యారు.

# రాజశేఖర్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు



**రాజమహేంద్రవరం, సెప్టెంబరు 24, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ ఆకస్మిక మృతి పట్ల వైఎస్సార్‌సీపీ యువ జన విభాగం రాష్ట్ర అధ్య క్షుడు, శ్రీమాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేసిన రాజశేఖర్ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లడంలో,పార్టీ ప్రచార వ్యవస్థను బలోపే తం చేయడంలో రాజశే ఖర్ చురుకైన పాత్ర పోషించారని రాజా గుర్తు చేశారు.పార్టీ కోసం నిరం తరం పనిచేస్తూ నాయ కులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందు కు సాగిన ఆయన సేవలు చిరస్మరణీ యమన్నారు. అలాంటి క్రియాశీల నాయకుడిని ఆకస్మికంగా కోల్పోవడం పార్టీ శ్రేణుల కు తీవ్ర విషాదాన్ని కలి గించిందన్నారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులకు జక్కంపూడి రాజా తన ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఆయ న ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షు డు అడబాల చినబాబు కూడా రాజశేఖర్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ ప్రచార విభాగంలో ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. రాజశేఖర్ వంటి చురు కైన, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం పార్టీకి, పార్టీ ప్రచార విభా గానికి తీరని లోటని పేర్కొన్నారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.






## వైష్ణవి చైతన్య వయసుపై ట్రోలింగ్..

### ఆధార్ కార్డ్ చూపించి మరీ కౌంటరిచ్చిన 'బేబీ' హీరోయిన్

ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీ తారలపై ఓ రేంజ్‌లో ట్రోలింగ్ జరుగుతోంది. సినిమాలతో పాటు సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలపై కూడా కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. అలా ఇటీవల టాలీవుడ్ యంగ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య వయసుపై కూడా సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగింది. తాజాగా వీటిపై స్పందించిన ఆమె ఆధారాలతో సహా ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటరిచ్చింది. టాలీవుడ్ లో సత్తా చాటుతోన్న హీరోయిన్లలో వైష్ణవి చైతన్య ఒకరు. హైదరాబాద్‌కు చెందిన ఈ ముద్దుగుమ్మ మొదట యూట్యూబర్ గా కెరీర్ ప్రారంభించింది. షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. మొదట చిన్న చితకా పాత్రలు చేసింది. అలా వైకుంఠపురంలో, రంగ్ దే, టక్ జగదీష్, వరుడు కావలెను తదితర సినిమాల్లో వైష్ణవి సహాయక నటిగా మెప్పించింది. ఇక బేబీ మూవీతో హీరోయిన్ గా అరంగేట్రం చేసిందీ అందాల తార. ఈ సినిమాలో నటనతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయిందీ అందాల తార. సినిమా కూడా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఆ తర్వాత లవ్ మీ, జాక్ సినిమాలలో హీరోయిన్‌గా నటించింది. ఇక ఇటీవలే ఎపిక్ అనే సినిమాతో ఆడియెన్స్ ను పలకరించింది వైష్ణవి. బేబీ హీరో ఆనంద్ దేవరకొండ ఇందులో హీరోగా నటించాడు. సెప్టెంబర్ 11న విడుదలైన ఈ సినిమా యావరేజ్ గా నిలిచింది. కాగా ఎపిక్ సినిమా ప్రమోషన్లలో భాగంగా పలు ఛానెల్స్ కు ఇంటర్వ్యూలు ఇచ్చింది వైష్ణవి. ఇందులో భాగంగా తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకుది. ఇదే సందర్భంగా తన వయసు గురించి వస్తున్న రూమర్స్‌కు వైష్ణవి చైతన్య చెక్ పెట్టింది. ఇంటర్వ్యూలో భాగంగా ఒక పాత్రలో కొన్ని చీటీలు ఉంచి వాటిలో ఒక్కొక్క దానిని సెలెక్ట్ చేసుకోమని యాంకర్ వైష్ణవికి ఇచ్చింది. వికీపీడియా ప్రకారం మీ వయసు 32 సంవత్సరాలు అని ఉంది. అయినప్పటికీ మీరు 25 ఏళ్ల అమ్మాయిలా యంగ్‌గా కనిపిస్తున్నారు.. ఇలా ఉండేందుకు మీ బ్యూటీ సీక్రెట్ ఏంటని యాంకర్ ప్రశ్నించింది. దీనికి వైష్ణవి ఇలా స్పందించింది. 'వికీపీడియాలో నా వయసు గురించి ఉన్నది పూర్తిగా తప్పుడు సమాచారం. అందులో చెప్పినట్లు నా బర్త్ ప్లేస్ కూడా కరెక్ట్ కాదు. నా వయసు 25 ఏళ్లు మాత్రమే' అని ట్రోలర్లకు స్ట్రాంగ్ కౌంటరిచ్చింది వైష్ణవి. ఇక ఇదే ఇంటర్వ్యూలో భాగంగా ఒక గేమ్‌లో మీ ఆధార్ కార్డ్ ఫోటో చూపించమని యాంకర్ అడగ్గా వెంటనే తన మొబైల్ లో ఉన్న ఆధార్ ఫొటో చూపించింది వైష్ణవి. అందులో తను పుట్టిన సంవత్సరం 2001గా ఉంది. ప్రస్తుతం వైష్ణవి కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.

### రిలీజ్‌కు ముందే

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి 'రాకా'..

### అల్లు అర్జున్ ఏమన్నారంటే?





'పుష్ప 2' తర్వాత వస్తోన్న చిత్రం కావడంతో 'రాకా'పై అంచనాలు భారీగా ఉన్నాయి. అందుకు తగ్గట్టుగానే ఇప్పటివరకు ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్ మూవీపై మరింత ఇంట్రెస్ట్ ను క్రియేట్ చేశాయి. తాజాగా ఈ పాన్ వరల్డ్ మూవీ గురించి పలు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు అల్లు అర్జున్. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'రాకా'. హాలీవుడ్ రేంజ్ లో సోషియో ఫాంటసీ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతోన్న ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె హీరోయిన్ గా నటిస్తోంది. సన్ పిక్చర్స్ బ్యానర్ సంస్థ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ తో సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ఇప్పుడు రిలీజుకు ముందే ఈ సినిమా హిస్టరీ క్రియేట్ చేసింది. 'రాకా' టీమ్ 37 మంది నటీనటులను ఏకకాలంలో చిత్రీకరించి, రియల్-టైమ్‌లో అత్యధిక మంది కదలికలను క్యాప్చర్ చేసిన సినిమాగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఓ స్పెషల్ ఈవెంట్ నిర్వహించింది. ఇందుకు సంబంధించిన వీడియోని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ 'రాకా'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "రాకా' గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎక్కినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా ఒక రిమార్కబుల్ ఫీట్ సాధించినందుకు మేము చాలా గర్వపడుతున్నాం. ఇది వరల్డ్ సినిమాకి ఒక కొత్త బెంచ్ మార్క్ సెట్ చేస్తుంది. అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. రాకాతో కేవలం ఇండియన్ స్టాండర్డ్స్ మాత్రమే కాదు, గ్లోబల్ స్టాండర్డ్స్ లిమిట్స్ సెట్ చేస్తున్నాం. మాకు ఈ అరుదైన గౌరవాన్ని ఇచ్చినందుకు 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'కు నేను థ్యాంక్స్ చెబుతున్నాను. డైరెక్టర్ అట్లీ విజన్ లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. అట్లీ వల్లే ఈరోజు ఇంతటి టెక్నికల్ అచీవ్మెంట్ సాధించి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అందుకున్నాము. ఇండియన్ సినిమా ప్రమాణాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లి, మమ్మల్ని గర్వపడేలా చేసినందుకు అట్లీకి థ్యాంక్స్. మీరు ఈ గొప్ప విజయంతో పాటు ఇప్పటికే ఎన్నో, మరెన్నో విజయాలను సాధించాలి. 'రాకా' సినిమాటోగ్రాఫర్ విష్ణు, మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్, ప్రొడక్షన్ డిజైనర్, ఫైట్ మాస్టర్ కు ధన్యవాదాలు. మీ అందరి సహకారం లేకుండా ఈ ఘనత సాధ్యమయ్యేది కాదు. ఈ సినిమా కోసం మేము కాస్త ఎక్కువ టైమ్ తీసుకుంటున్నామని నాకు తెలుసు. మీకు బెస్ట్ సినిమా అందించడానికి మేం అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాం. ప్రతి ఒక్కరూ కాస్త ఓపిక పట్టాలని రిక్వెస్ట్ చేస్తున్నాం. మాకు అన్ని విధాలుగా సపోర్ట్ అందించినందుకు సన్ పిక్చర్స్ కు థ్యాంక్స్ చెప్తున్నా. 'రాకా' మూవీ ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరుస్తుందని ఆశిస్తున్నాను' అని అల్లు అర్జున్ చెప్పుకొచ్చారు.

## జపాన్‌తోనే వణికిపోయారు.. మరి శ్రేయాస్ సేన గోల్డ్ పట్టేదెలా..?



ఆసియా క్రీడల్లో మహిళల జట్టు స్వర్ణం సాధించడంతో పురుషుల జట్టుపై అంచనాలు పెరిగాయి. జపాన్‌తో మ్యాచ్‌లో ఎదురైన అనుభవాలు, వాతావరణ సవాళ్లు టీమ్ ఇండియాకు హెచ్చరిక. స్వర్ణం గెలవాలంటే సరైన వ్యూహాలు, నిరంతర ప్రాక్టీస్, ఆటగాళ్ల నుండి గుణపాఠాలు నేర్చుకోవడం అత్యవసరం. క్వార్టర్‌ఫైనల్స్ నుండి ఫైనల్ వరకు ప్రతి మ్యాచ్ కీలకం. ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు అద్భుతమైన ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ విజయం భారత పురుషుల క్రికెట్ జట్టుపై అంచనాలను భారీగా పెంచింది. పురుషుల జట్టు కూడా గోల్డ్ మెడల్ సాధించాలని యావత్ దేశం ఆశిస్తోంది. అయితే, ఈ స్వర్ణ పతక లక్ష్యాన్ని చేరుకోవడానికి టీమ్ ఇండియా అనేక సవాళ్లను ఎదుర్కొని, పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలి. ఇటీవలి కాలంలో టీమ్ ఇండియా విజయాల బాట పట్టింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఎదురైన పరాజయాల తర్వాత, జింబాబ్వేపై మూడు, ఆఫ్ఘనిస్తాన్‌పై మూడు విజయాలు, ఆపై జపాన్‌తో ఏకైక టీ20 మ్యాచ్‌లో విజయం సాధించి వరుసగా ఏడు విజయాలను నమోదు చేసింది. ఈ విజయ పరంపర ఆత్మవిశ్వాసాన్ని పెంచినప్పటికీ, జపాన్‌తో జరిగిన మ్యాచ్ టీమ్ ఇండియాకు ఒక ముఖ్యమైన హెచ్చరికగా మారింది. జపాన్‌ను తక్కువ అంచనా వేసి, సరైన ప్రాక్టీస్ లేకుండా బరిలోకి దిగినట్లు నెటిజన్లు అభిప్రాయపడ్డారు. ఇది భవిష్యత్ మ్యాచ్‌లలో జట్లు తమకు ఎదురయ్యే ప్రత్యర్థుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలనే సందేశాన్నిచ్చింది. వాతావరణ పరిస్థితులు కూడా మ్యాచ్‌లపై ప్రభావం చూపవచ్చు. జపాన్‌లో వాతావరణం కారణంగా ఐదు ఓవర్ల మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉన్నందున, ఇలాంటి క్లిష్ట పరిస్థితులకు కూడా భారత్ సిద్ధంగా ఉండాలి. షార్ట్ ఫార్మాట్ మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకొని అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం చాలా అవశ్యకం. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్ వంటి యువ ఆటగాళ్లు తమ తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకొని, తమ ఆటతీరును మెరుగుపరచుకోవాలి. జట్టు విజయంలో ప్రతి ఆటగాడి పాత్ర కీలకమని, ఎవరికి వారే బాధ్యతాయుతంగా ఆడాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు. భారత్ ఈ నెల 28న ఆసియా క్రీడలలో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్ ఎలో ఆఫ్ఘనిస్తాన్, జపాన్, నేపాల్ జట్లు ఉన్నాయి. వీటిలో గ్రూప్ టాపర్‌తో భారత్ క్వార్టర్ ఫైనల్ ఆడుతుంది. జపాన్ ఆట తీరును బట్టి చూస్తే, క్వార్టర్ ఫైనల్‌లో మళ్లీ అదే జట్టు ప్రత్యర్థిగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. క్వార్టర్ ఫైనల్‌లో గెలిస్తే, అక్టోబర్ 1న సెమీఫైనల్, అక్టోబర్ 3న ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ కీలకమైన మ్యాచ్‌లలో గెలవాలంటే టీమ్ ఇండియా సరైన వ్యూహంతో బరిలోకి దిగాలి. బాగా ప్రాక్టీస్ చేయాలి, అలాగే పిచ్ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయగలగాలి. ముఖ్యంగా సెమీఫైనల్, ఫైనల్‌లో పాకిస్తాన్, శ్రీలంక లేదా బంగ్లాదేశ్ వంటి బలమైన జట్లతో తలపడే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, టీమ్ ఇండియా కఠినమైన ప్రాక్టీస్‌తో పాటు పకడ్బందీ వ్యూహ రచనతో బరిలోకి దిగాలి. ప్రణాళికాబద్ధంగా ఆడితేనే గోల్డ్ మెడల్ సాధించే అవకాశం ఉంటుంది. భారత జట్టు ఈ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని, స్వర్ణ పతకంతో తిరిగి రావాలని దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## ఆసియా క్రీడల్లో భారత్ - పాకిస్తాన్ మ్యాచ్.. ఎప్పుడు, ఎక్కడంటే?

ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ సెప్టెంబర్ 24 నుంచి ప్రారంభం కానుంది. ఇందులో 10 జట్లు పతకాల కోసం పోటీపడతాయి. భారత్, పాకిస్తాన్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాక్ హై-వోల్టేజ్ మ్యాచ్ ఫైనల్ లేదా కాంస్య పతకం కోసం జరిగే మ్యాచ్‌లో జరిగే అవకాశం ఉంది. టోర్నమెంట్ ఫార్మాట్ మరియు షెడ్యూల్ వివరాలు ఇక్కడ ఉన్నాయి. జపాన్‌లోని ఐచి-నగోయాలో 20వ ఆసియా క్రీడలు జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో పురుషుల క్రికెట్ ఈవెంట్ సెప్టెంబర్ 24న ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్, ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది. ఆసియా క్రీడల చరిత్రలో క్రికెట్ జరగడం ఇది నాలుగోసారి. ఇందులో మొత్తం 10 జట్లు పతకాల కోసం పోటీ పడుతున్నాయి. ఈ ఈవెంట్ షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. అయితే, భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరగాల్సిన హై-వోల్టేజ్ మ్యాచ్ ఎప్పుడు జరుగుతుందనేదే అభిమానుల మదిలో మెదులుతున్న పెద్ద ప్రశ్న. టోర్నమెంట్ అధికారిక ఫార్మాట్, ర్యాంకింగ్ ప్రకారం ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ జరిగే అవకాశం ఉంది. కానీ ఈ మ్యాచ్ జరగాలంటే, రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాల్సి ఉంటుంది.

**స్వర్ణ పతకం కోసం 10 జట్లు పోటీ..**



ఈసారి పురుషుల క్రికెట్‌లో 10 దేశాలు పాల్గొంటున్నాయి. ర్యాంకింగ్‌ల ఆధారంగా భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. పూర్తి సభ్య జట్టుగా ఆఫ్ఘనిస్తాన్ ప్రధాన డ్రాలో నేరుగా స్థానం దక్కించుకుంది. వీటికి అదనంగా, జూన్‌లో జరిగిన ఆసియా క్రీడల క్వాలిఫికేషన్ రౌండ్ ద్వారా హాంకాంగ్, మలేషియా, నేపాల్, ఒమన్ ప్రధాన డ్రాకు అర్హత సాధించాయి. మరోవైపు, ఆతిథ్య దేశంగా జపాన్ నేరుగా ప్రవేశం పొందింది.

**టోర్నమెంట్ ఫార్మాట్ ఎలా ఉంటుంది?**

ఐసీసీ ర్యాంకింగ్‌ల ఆధారంగా అట్టడుగున ఉన్న ఆరు జట్లు - ఆతిథ్య జపాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, ఒమన్, మలేషియా, హాంగ్ కాంగ్ - ఒక్కో గ్రూపులో మూడు జట్ల చొప్పున రెండు గ్రూపులుగా విభజించబడ్డాయి. ఈ జట్ల మధ్య రౌండ్-రాబిన్ పద్ధతిలో టోర్నమెంట్ జరుగుతుంది. ఆ తర్వాత, ప్రతి గ్రూపు నుంచి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు క్వార్టర్-ఫైనల్స్‌కు చేరుకుంటాయి. ఈ నాలుగు జట్లు భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో తలపడతాయి. దీని తర్వాత సెమీ-ఫైనల్స్, ఫైనల్ జరుగుతాయి.

**భారత్-పాకిస్తాన్ ఘర్షణ ఎప్పుడు జరగనుంది?**

షెడ్యూల్, డ్రా ప్రకారం, భారత్, పాకిస్తాన్ జట్లు గ్రూప్ దశలో గానీ, ప్రాథమిక క్వార్టర్-ఫైనల్స్‌లో గానీ తలపడవు. రెండు జట్లు తమ తమ విభాగాలలో నేరుగా క్వార్టర్-ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. రెండు జట్లు నాకౌట్ దశకు చేరుకుంటేనే భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఒకవేళ రెండు జట్లు తమ తమ క్వార్టర్-ఫైనల్స్, సెమీ-ఫైనల్స్‌లో గెలిస్తే, అక్టోబర్ 3న జరిగే స్వర్ణ పతకం మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ తలపడతాయి. అంతేకాకుండా, ఒకవేళ రెండు జట్లు సెమీ-ఫైనల్స్‌లో ఓడిపోతే, అక్టోబర్ 3న జరిగే కాంస్య పతకం మ్యాచ్‌లో అవి తలపడే అవకాశం ఉంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com